



# రైతుభరోసాలో కోత!

## రైతు మొత్తం భూమికి జమ కాని డబ్బు

**2.38 ఎకరాలకు రూ.17,700 రావాల్సి ఉంటే రూ.14, 250 మాత్రమే జమ**

- **23 గుంటలకు రూ.3,450 గల్లంతు**
- **ఇదేంటని అడిగితే చేతులెత్తేసిన ఏఈవో**
- **దిక్కుతోచక రైతు రాములమ్మ ఆవేదన**
- **ఇలా లక్షలాది మంది రైతులకు కత్తిరింపు**

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ): నాగర్ కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం కొండారెడ్డిపల్లికి చెందిన దళిత పేద రైతు పంబ రాములమ్మ భర్త లక్ష్మయ్య పేరిట మొత్తం 2.38 ఎకరాల భూమి ఉన్నది. పాస్ బుక్ నెంబర్ టి03030080496 ప్రకారం సర్వే నెం.392అలో 9 గుంటలు, 393అలో 7 గుంటలు, 421ఊలో 7 గుంటలు, 451ఆలో 2.15 గుంటల భూమి ఉంది. ఈ లెక్కన రైతుభరోసా కింద ఎకరానికి రూ.6 వేలు (గుంటకు రూ.150) ప్రకారం 118 గుంటలకు రూ.150 చొప్పున ఆమెకు రూ.17,700 అందాలి. కానీ కాంగ్రెస్ సర్కారు రూ.3,450 కోత పెట్టి, కేవలం రూ.14,250 మాత్రమే జమ చేసింది. మొత్తం భూమిలో సర్వే నెం.451లోని 2.15 ఎకరాల భూమికి మాత్రమే రైతుభరోసా జమ చేసిన ప్రభుత్వం మిగిలిన సర్వే నెంబర్లలోని 23 గుంటలకు కోత పెట్టింది. ఇదేమిటని సదరు రైతు ఏఈవోను అడిగితే 'మాకు తెలియదు' అనే సమాధానమే ఎదురైంది. ఇది ఒక్క రాములమ్మ పరిస్థితే కాదు.. లక్షలాది మంది రైతుల దుస్థితి!

### ప్రభుత్వం చెప్తలేదు.. మేమేం చేయాలి?

రైతుల పేరిట ఉన్న మొత్తం భూమికి రైతు భరోసా పెట్టుబడి సాయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం జమ చేయడం లేదు. కొంత భూమికి కోత పెడుతుండగా కారణాలు తెలియడం లేదు. ఈ సమస్యలపై ఏఈవోలకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. వ్యవసాయ అధికారులను అడిగినా తమకు తెలియదనే చెప్తున్నారు. దీనిపై ఓ ఏఈవో స్పందిస్తూ 'ఈ సీజన్‌లో రైతుభరోసా ఏ లెక్క ప్రకారం వేస్తున్నారో తెలుస్తలేదు. అంతా గందరగోళంగా ఉన్నది.' అంటూ వాపోయారు.

### 3 లక్షల ఎకరాలు బ్లాక్ !

రైతుభరోసాలో కోతలు పెట్టేందుకు సర్కారు కుంటి సాకులు వెతుకుతున్నదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రైతులకు ఏ విధంగా ఎగ్గొట్టాలి? ఎలా కోత పెట్టాలనే ఆలోచన చేస్తున్నదనే ఆరోపణలున్నాయి. ఈ సీజన్‌లో సుమారు 3 లక్షల ఎకరాలకు రైతుభరోసా సాయం పడకుండా ఆ భూములను బ్లాక్ చేసినట్టు తెలిసింది. ఈ విషయాన్ని వ్యవసాయశాఖ అధికారులే స్వయంగా ధ్రువీకరించారు. సర్వేనంబర్లలో వాస్తవంగా ఉండాల్సిన భూమి కన్నా ఎక్కువ ఉన్నదనే సాకు ముందట వేసుకున్నట్టు తెలుస్తున్నది. ఉదాహరణకు 750 సర్వే నంబర్‌లో 10 ఎకరాలుండాలి. కానీ కాలక్రమంలో క్రయవిక్రయాలతో ఆ సర్వే నంబర్‌లో 12-15 ఎకరాల భూమి ఉన్నట్టుగా గుర్తించినట్టు చెప్తున్నారు. అలాంటి సర్వే నంబర్లను గుర్తించి వాటిని బ్లాక్ చేసినట్టుగా అధికారులు తెలిపారు. ఎక్కువ ఉన్న భూమిని బ్లాక్ చేయకుండా మొత్తం సర్వేనంబర్‌ను బ్లాక్ చేసి, ఆ సర్వేనంబర్‌లోని భూమికి రైతు భరోసా పడకుండా చేసినట్టు తెలిసింది.

### మండిపడుతున్న రైతులు

రైతుభరోసా విషయంలో కాంగ్రెస్ సర్కారుపై రైతులు తీవ్రంగా మండిపడుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు సీజన్లు ముగిశాయి. ఇందులో కేవలం నిరుడు యాసంగిలో మాత్రమే పాత పదివేలు (రైతుబంధు) జమ చేసింది. రైతు భరోసాలో మార్పులు, చేర్పులు, కోతల పేరిట వానకాలం సీజన్‌లో ఎగ్గొట్టింది. ఈ యాసంగికైనా మొత్తం డబ్బు పడుతుందేమోనని ఆశించిన రైతులకు నిరాశ తప్పలేదు. జనవరి 26న ఆర్భాటంగా ప్రారంభించిన రైతుభరోసా పంపిణీ నేటికీ పూర్తికాలేదు. ఇంకా రైతులకు రూ.4,834 కోట్లు కాంగ్రెస్ సర్కారు బాకీ ఉన్నది. ఈ బకాయిలను మార్చి 31లోపు చెల్లిస్తామని అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటారో? లేదో చూడాలి.

### సాయం ఎయ్యకపోతే ఎట్లా?

కేసీఆర్ ఉన్నప్పుడు మా మొత్తం భూమికి రైతుబంధు పైసలు పడేటివి. కానీ ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు కోత పెడుతున్నది. మా ఏఈవో సార్‌ను అడిగితే ఆయనకు తెల్వదని చెప్తున్నడు. సాగు భూమికి కూడా సాయం ఇయ్యకపోతే ఎట్లా?

- పంబ రాములమ్మ, రైతు

# రైతుల ఉసురు తీస్తూ రాక్షసానందం



చివ్వెంల మండలం మొగయ్యగూడెంలో ఎండిన పంటలను పరిశీలించి రైతు భూక్యా తేజాను ఓదారుస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

- **ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ కరువే**
- **ఒక్క తడకి నీళ్లు ఇచ్చినా సగం పంట చేతికి వచ్చేది**
- **రాష్ట్ర సర్కార్ తీరుపై మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఫైర్**
- **సూర్యాపేట జిల్లా మొగ్గయ్యగూడెంలో ఎండిన పంటల పరిశీలన**

చివ్వెంల, మార్చి 26 : దోచుకోవడం.. పంచుకోవడం.. దాచుకోవడం.. ఈ మూడే కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. పంటలు ఎండి రైతులు గోస పడుతున్నా పట్టించుకునే తీరిక ఈ సర్కార్‌కు లేదని ధ్వజమెత్తారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని, ముమ్మాటికీ కాంగ్రెస్ తెచ్చిన కరువేనని స్పష్టంచేశారు. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం మొగ్గయ్యగూడెం గ్రామంలో ఎండిన పొలాలను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఉసురు తీస్తూ రాక్షసానందం పొందుతున్నదని దుయ్యబట్టారు. పదేండ్లు ప్రశాంతంగా ఉన్న రైతాంగానికి మళ్లీ కన్నీళ్లు తెప్పిస్తున్నదని విమర్శించారు. పొట్టకొచ్చి పంటకు నీళ్లు లేక పశువుల మేతకు వదిలి పెట్టే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్త చేశారు. కనీసం ఒక తడి ఇస్తే సగం పంటైనా దక్కేదని, రెండు తడులు ఇస్తే అప్పుల తిప్పలు ఉండేవి కావని పేర్కొన్నారు. ఏడాదిన్నర కాకముందే అన్ని రంగాల్లో ఇంత నిర్లక్ష్యమా? అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభించిన తర్వాత ఎకరం కూడా ఎండిపోలేదని, కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత రెండు సార్లు యాసంగి పంటలు ఎండిపోయాయని గుర్తుచేశారు. కాళేశ్వరం కాకుండా ఎస్సారెస్పీ నీళ్లే అయితే ఇప్పుడు పంటలు ఎందుకు ఎండుతున్నాయో మంత్రులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు తమకు అప్పగిస్తే ఎకరం కూడా ఎండిపోకుండా కాపాడుకుంటామని చెప్పారు.

### మా బతుకులు ఆగమైనయ్

నేను యాభై ఏండ్ల సంది వ్యవసాయం చేస్తున్న. ఆరేండ్లల్లో చూసిన నీళ్లను ఎప్పుడూ చూడలే. ఇగ నీళ్లకు కొదువ లేదనుకున్నం. అయ్యా.. జగదీశ్ రెడ్డి సారూ... కేసీఆర్ ప్రభుత్వంలో మీరు మంత్రిగా ఉన్నప్పుడు చాలా బాగుండే. పొలాలు కోసేనాటికి కూడా మడులల్ల నిండా నీళ్లు ఉండేవి. పొలాలు కొయ్యాల్నంటే కోత మిషన్లు దిగబడేవి. ఇయ్యాల నీళ్లు లేక మా బతుకులు ఆగమైనయ్. ఎండిన పొలాలకు నష్టపరిహారం ఇప్పించాలి.

–భూక్యా తేజా, రైతు, మొగ్గయ్యగూడెం



### వరికి ట్యాంకర్ నీరే దిక్కు

నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రానికి చెందిన రైతు చెలిమెల మహేశ్ నాలుగెకరాల్లో వరి వేశాడు. నీరందక పంట ఎండుముఖం పట్టింది. ఎలాగైనా పంటను కాపాడుకోవాలని రోజూ ట్యాంకర్ ద్వారా నీళ్లు పడుతున్నాడు. పంట ఎండిన రైతులకు ప్రభుత్వం అండగా నిలవాలని కోరుతున్నాడు. – ధర్పల్లి



జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలం వెంకటాపురం శివారులో ఎండిన వరి పొలాలను పరిశీలిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

# రైతులంటే సర్కార్‌కు సోయిలేదు

- **కేసీఆర్ హయాంలో పంటలు పండితే.. రేవంత్ పాలనలో మొత్తం ఎండుతున్నయి**
- **ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రైతులందరికీ కష్టాలు**
- **మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మండిపాటు**
- **కేటీదొడ్డి మండలంలో ఎండిన పంటల పరిశీలన**

గద్వాల, మార్చి 26 : యాసంగి రైతులు సాగునీళ్లులేక పంటలు ఎండిపోయి లబోదిబోమంటుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి సోయి లేకుండా పోయిందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. నాటి కేసీఆర్ ప్రభుత్వంలో బంగారు పంటలు పండితే.. రేవంత్ పాలనలో పంటలు ఎండిపోతున్నాయని ఆరోపించారు. జోగుళాంబ గద్వాల జిల్లా నెట్టెంపాడ్ ప్రాజెక్టు పరిధిలోని ర్యాలంపాడ్ రిజర్వాయర్ 104 ప్యాకేజీ కింద కేటీదొడ్డి మండలం కొండాపురం, వెంకటాపురం, ఉమిత్యాల, గువ్వలదిన్నె గ్రామాల్లో ఎండిన పంటలను బుధవారం ఆయన బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. రైతులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకొన్నారు. అక్కడి నుంచే నిరంజన్‌రెడ్డి కలెక్టర్ సంతోష్, ఇరిగేషన్ ఎస్ఈ రహీముద్దీన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన ఇండెంట్ నీటిని త్వరలో కర్ణాటక ప్రభుత్వం నుంచి విడుదల చేయించాలని సూచించారు. అనంతరం ఆయన జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో మీడియాతో మాట్లాడారు. ఇక్కడి ఎమ్మెల్యే, అధికారుల సూచనలతోనే రైతులు పంటలు సాగు చేయగా.. నేడు ఎండుతున్నా వారు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తన జిల్లా అని సీఎం రేవంత్‌రెడ్డి గొప్పగా చెప్పుకుంటారని, కానీ ఇక్కడ సాగైన పంటలు ఎండుతుంటే ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. సీఎంతోపాటు మంత్రులంతా వారి సీటును కాపాడుకునే పనిలో ఉన్నారని దుయ్యబట్టారు. ప్రజలు, రైతులు నమ్మి ఓట్లేసినందుకు ప్రభుత్వం వారి గొంతు కోసిందని ధ్వజమెత్తారు. ఎండిన పంటలను పరిశీలించడంలో మంత్రులకు పట్టింపు లేదని.. సీఎంకు తీరిక లేదని విమర్శించారు.

## మోటర్లు కాలిపోతున్నయ్..



ఆదిలాబాద్ జిల్లాలో భూగర్భజలాలు అండగంటిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తాంసి మండలం కప్పర్లకు చెందిన రైతు పోగుల అశోక్ 1.5 ఎకరాల్లో జొన్న సాగు చేశాడు. భూగర్భ జలాలు ఇంకిపోవడంతో రెండు బోరుబావుల్లో నీళ్లు రావడం లేదు. పంటలను కాపాడుకుందామని బోర్లు వేస్తే కాలిపోతున్నాయి. ఒకసారి మోటర్ కాలిపోతే రూ.5 వేలు ఖర్చు అవుతున్నాయని రైతు అశోక్ ఆవేదన వ్యక్తం చేశాడు. నీళ్లు లేక జొన్నతోపాటు కూరగాయల పంటలు నష్టపోవాల్సి వస్తున్నదని తెలిపాడు.

– ఆదిలాబాద్, నమస్తే తెలంగాణ





## చివరి తడి ఎలా?

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మొగుళ్లపల్లి మండలం అంకుశాపూర్ గ్రామానికి సాగునీరు అందక రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఎంపిక చేసిన పైలట్ గ్రామాల్లో ఇదీ ఒకటి. సాగునీరు లేక ఎండిపోతున్న పంటలను పట్టించుకునేవారు కరువయ్యారు. పక్కనే ఉన్న చలివాగులో చుక్క నీరు లేక ఎడారిని తలపిస్తున్నది. అంకుశాపూర్‌లో నీరు లేక సుమారు 40 ఎకరాల్లో వరి ఎండిపోయింది. సుమారు 231 ఎకరాల్లో వరి సాగు చేయగా సుమారు 70 ఎకరాల్లో మక్కజొన్న వేశారు. సాగు నీరు లేక, భూములు నెర్రెలుబారాయి. గ్రామ శివారులో చలివాగుపై చెక్‌డ్యాం నిర్మించినా నీళ్లు లేకపోవడంతో ఉపయోగం లేకుండాపోయింది. వాగు పొడవునా రైతులు పూడికతీస్తూ, బోర్లు వేస్తూ నీటికోసం అన్ని భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు.

## సాగునీటికి చెలిమెలే దిక్కు



మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండల కేంద్రంతోపాటు విస్సంపల్లి, జయ్యారం, ఉగ్గంపల్లి, మన్నెగూడెం తదితర గ్రామాల్లో సాగు నీరులేక పొలాలు ఎండిపోతున్నాయి. గతంలో నీటితో కళకళలాడిన ఆకేరు వాగు నేడు వెలవెలబోతున్నది. ఉగ్గంపల్లికి చెందిన రైతు దారమల్ల వెంకన్న యాసంగిలో రెండెకరాల్లో వరి సాగు చేశాడు. పంటను కాపాడుకునేందుకు వాగులో చెలిమ తీసి నీరందిస్తున్నాడు. మరికొందరు రైతులు ఇదేవిధంగా నీటినందిస్తున్నారు. –చిన్నగూడూరు

## నీళ్లులేక రాళ్లు తేలిన కృష్ణమ్మ



తెలంగాణలో రెండో పెద్దనది కృష్ణమ్మ నీళ్లులేక వెలవెలబోతున్నది. వేసవి ప్రారంభానికి ముందే రాళ్లు తేలి జీవం కోల్పోయింది. నెల కిందటి వరకు జలకళను సంతరించుకున్న నది ఒక్కసారిగా వట్టిబోయింది. నారాయణపేట జిల్లా మాగనూరు మండలం కొల్పూరు శివారులో కళావిహీనంగా దర్శనమిస్తున్నది. దీంతో నదీ జలాలపై ఆధారపడిన ఎత్తిపోతల పథకాలకు నీరు అందడం లేదు. ఫలితంగా పంటలు ఎండుముఖం పడుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. – మాగనూరు

### ఎనిమిదేండ్లలో ఎన్నడూ పొలం ఎండిపోలే

**సిద్దిపేట జిల్లా అక్కారం రైతు మల్లయ్య ఆవేదన**



గజ్వేల్, మార్చి 26: ఎనిమిదేండ్లలో ఎన్నడూ తన వరి పంట ఎండిపోలేద ని, ఎప్పుడూ లేనిది ఈ యేడు సా గు చేసిన వరి ఎండిపోతే గుండె బా ధగా ఉన్నదని సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం అక్కారం గ్రామానికి చెందిన రైతు బుడిగె మల్లయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. నీళ్లు లేక ఎండిపోయిన వరి పంటను బర్రెకు మేపు తూ ఆయన బుధవారం 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు. రెండున్నర ఎకరాల్లో వరి సాగుచేస్తే రెండె కరాలు ఎండిపోయిందన్నాడు. నాట్లు వేసేటప్పుడు బోర్ల నుంచి నీళ్లు బాగానే వచ్చాయని, నీళ్లు వొస్తున్నయని మరింత పొలాన్ని ఇతరుల వద్ద కౌలుకు తీసుకొని నాటు వేసినట్టు చెప్పాడు. మొత్తం బోరుతోనే పారుతదని అనుకుంటే ఈ యేడు బోర్ల నీళ్లు ఎక్కువగా వస్తలేవని తెలిపాడు. కేసీఆర్ ఉండగా కాలువల్లో నీళ్లు ఎక్కువగా ఉంటే తమ ఊరి బోర్లు బాగా పోసేవని, ఈసారి కాలువల్లో నీళ్లు లేక బోర్లలో నీళ్లు తగ్గి సాగు చేసిన పొలాలు పా రుత లేవని ఆవేదన చెందాడు. రైతులందరిది ఇదే పరిస్థితి ఉన్నదని తెలిపాడు. సాగు కోసం చేసిన అప్పులు మీద పడ్డాయని పేర్కొన్నాడు. వాటిని ఎట్లా తీర్చాలో అర్థమైతలేదని వాపోయాడు.

# మల్లన్నసాగర్ ఉన్నా నీళ్లు రాకపాయె

- **దుబ్బాకలో పంటలు ఎండిపాయె**
- **వందలాది బోరుబావుల తవ్వకం**
- **పంటలు కోల్పోయి పుట్టెడు కష్టాల్లో రైతుల ఆవేదన**
- **'నమస్తే' ఫీల్డ్ విజిట్‌లో వెలుగుచూసిన వాస్తవాలు**



దుబ్బాక మండలం రఘోత్తంపల్లిలో ఎండిన వరి పంటలో జీవాలను మేపుతున్న కాపరి

దుబ్బాక, మార్చి 26 : తలాపున మల్లన్న సాగర్ రిజర్వాయర్ ఉన్నా దుబ్బాక రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. బీఆర్‌ఎస్ హయాంలో ఈ ప్రాంతంలోని చెరువులు, కుంటలు, కూడవెల్లి వాగు మండుటెండల్లో సైతం జలకళ ఉట్టిపడి పంటలు పండాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో సాగు భూములు సైతం బీడు బారుతున్నాయి. చెరువులు, కుంటల్లో నీరులేక ఎడారిని తలపిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో సాగు నీరందక చేతికొచ్చే సమయంలో వరి పంటలు ఎండిపోతున్నాయి. మల్లన్నసాగర్ ప్రాజెక్టు నుంచి కూడవెల్లి వాగులోకి సకాలంలో సాగు నీరు విడుదల చేయలేదు. దీంతోపాటు 4ఎల్ డిస్ట్రిబ్యూటరీ కాల్వల నిర్మాణం పూర్తికాక పోవడంతో రైతులు సాగునీటి కష్టాలు ఎదురయ్యాయి. నీరందక ఎండిన వరి పొలాలను రైతులు పశువులకు మేతకు వదిలేస్తున్నారు. ఏ పొలం చూసినా నెర్రెలిడి కనిపిస్తున్నాయి. దుబ్బాక మండలం రామక్కపేట, రఘోత్తంపల్లి గ్రామాల్లో బుధవారం 'నమస్తే తెలంగాణ' ఫీల్డ్ విజిట్ చేసింది. నీరులేక పొట్టదశకు వచ్చిన వరి పంటలు ఎండిపోతుండటం కనిపించింది. పంటలను కాపాడుకునేందుకు రైతులు అప్పులు చేసి బోర్లు తవ్విస్తున్నా చుక్కనీరు రావడం లేదు. ఈ రెండు గ్రామాల్లో నెల రోజుల్లో 400 బోరుబావులు తవ్వించినట్టు తెలిసింది. వీటిలో 90 శాతం బోరుబావుల్లో చుక్కనీరు పడలేదు. చెరువులు నీరులేక బోసిపోయాయి. గతేడాది యాసంగితో పోల్చితే ఈ సారి తక్కువ విస్తీర్ణంలో వరి సాగుచేసినప్పటికీ నీరందక ఎండిపోతున్నాయి. దుబ్బాక మండలం ఆకారం సెక్టార్‌లో ఈ యాసంగిలో 3,140 ఎకరాల వరి సాగు చేయగా, ఇందులో 40 శాతం పంట ఎండిపోయింది.

### పది బోర్లు తవ్వించిన..

నాకు ఐదెకరాల భూమి ఉన్నది. 3 ఎకరాల్లో వరి వేసిన. బోరు పోయక పంట ఎండిపోతుండటంతో నెల రోజుల కిందట ఐదు బోర్లు వేయించినా చుక్క నీరు పడలేదు. 800 ఫీట్ల కుపైగా బోరు తవ్వించినా తడి రాలేదు. మళ్లీ వారం తర్వాత మరో ఐదు బోర్లు తవ్వించిన. చివరి పదో బోరుకు 650 ఫీట్లకు నీరు వచ్చింది. రూ.7 లక్షల ఖర్చు పెట్టి పది బోర్లు తవ్వించిన. నా జీవితంలో పంటల సాగుకోసం ఎన్నడు ఇంత కష్టపడలేదు. ఇంత ఖర్చుకాలేదు.

– దొంతగొని యాదాగౌడ్, రైతు, రామక్కపేట (సిద్దిపేట జిల్లా)

## తడారిన మడి.. దక్కని పెట్టుబడి

మాజీ మంత్రి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సొంత మండలమైన కామారెడ్డి జిల్లా మాచారెడ్డిలో వందలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి. మాచారెడ్డి మండలం ఎల్లంపేటలో బోనాత్ అరుణ తనకున్న మూడెకరాల్లో వరి సాగు చేయగా, పంట ఎండిపోయింది. దీంతో పంటను జీవాలకు వదిలేసింది.

– మాచారెడ్డి, మార్చి 26

